దోమ : శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలో బొంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

వికారాబాద్ జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో ముందుగానే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. కోలాటం ఆడారు. పాటలు పాడి, నృత్యాలు చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమాలను చేపట్టారు. దీంతో పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. చక్కటి వేషధారణ, నృత్యాలను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

- వికారాబాద్ జిల్లా న్యూస్ నెట్‌వర్క్

కులకచర్ల : అల్లాపూర్ పాఠశాలలో గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

తాండూరురూరల్ : చిట్టిఘనాపూర్ పాఠశాలలో కోలాటమాడుతున్న చిన్నారులు

పూడూరు : కడ్మూర్ పాఠశాలలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు

కులకచర్ల : చెల్లాపూర్ పాఠశాలలో..

పెద్దేముల్ : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో బండపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

వికారాబాద్, ఆగస్టు 24 : వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వికారాబాద్ మండలానికి సంబంధించిన ఎల్‌వోసీలు-25, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 11 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మోమిన్‌పేట మండలానికి సంబంధించి ఎల్‌వోసీలు-47, కల్యాణలక్ష్మి, షాదీముబారక్-31 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులున్నారు.

పంటల పరిశీలన

మర్పల్లి, అగస్టు 24 : ప్రతి రైతు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో మహేశ్ అన్నారు. శనివారం మండలంలోని పంచలింగాల్, కొత్లాపూర్ గ్రామాల్లోని రైతుల పొలాలను సందర్శించి పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలను అన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే రైతులు ఏ పంటలు వేశారో.. అవి చేతికి వచ్చిన తరువాత మార్కెట్‌లో విక్రయించడానికి వీలుంటుందని పేర్కొన్నారు. మొక్కజొన్న, పత్తి, కంది పంటలకు మందులు పిచికారీ చేయడానికి వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలన్నారు.

పంచలింగాల్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో మహేశ్

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పరిగి, ఆగస్టు 24 : ఈ నెల 26న శ్రీకృష్ణాష్టమి వేడుకలను తుంకులగడ్డ వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని పట్టణ హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ తెలిపారు. హిందూ ఉత్సవ సమితి సమావేశంలో ఈమేరకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉదయం 11.30 గంటలకు పూజా కార్యక్రమం, మధ్యాహ్నం 12.30 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం, ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.

నేడు కరెంటు సరఫరాలో అంతరాయం

పరిగి, ఆగస్టు 24 : పరిగి పట్టణంలోని బహార్‌పేట్ హనుమాన్ మందిర్, వాగ్దేవి హాస్పిటల్, వల్లభ్‌నగర్, మార్కెట్‌యార్డు, గంజ్, శాంతినగర్, సయ్యద్‌వాడ, నాయకోటివాడలలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖాజా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ వర్క్స్, నిర్వహణ పనుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

పెద్దేముల్ మండలంలో...

పెద్దేముల్, ఆగస్టు 24 : ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు తాండూరులోని 220/132/33కేవీ తాండూరు ట్రాన్స్‌కో ఉపకేంద్రంలో మరమ్మతులు ఉన్నందున పెద్దేముల్‌తోపాటు ఉపకేంద్రం పరిధిలోని సుమారు 8 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నదని, ప్రజలు సిబ్బంది సహకరించాలని తాండూరు విద్యుత్ డీఈ భానుప్రసాద్ కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

బంట్వారం(కోట్‌పల్లి), ఆగస్టు 23 : బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. బస్వాపూర్‌కు చెందిన నాగిడెపల్లి ఏలియా(53) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నేండ్ల క్రితం తన తల్లి అనారోగ్యంతో ఉండడంతో తనకున్న పొలాన్ని అమ్మేసి ఆమెకు చికిత్స చేయించాడన్నారు. దీంతోపాటు, భార్యను వదిలేసి ఒంటరి జీవితం గడుపుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బొపునారంలో ఉన్న బంధువుల వద్దకు వచ్చాడని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బొపునారం శివారులో ఉన్న గొల్ల నర్సింహులు బావిలో దూకి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. ఉదయం వరకే మద్యం తాగి ఉన్నట్లు చెప్పారు. మృతుడి చిన్ననాన్న కొడుకు నాగిడెపల్లి ఎల్లప్ప ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీగా శివప్రసాద్

బంట్వారం(కోట్‌పల్లి), ఆగస్టు 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పెద్దేముల్ జోనల్ సెక్రెటరీగా కోట్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ శివప్రసాద్ ఎన్నికైనట్లు ఎంఈవో చంద్రప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. పెద్దేముల్, కోట్‌పల్లి, ధారూరు మండలాల జోనల్ స్థాయిలో జరిగే పాఠశాల క్రీడా పోటీలకు ఈయనను ఎన్నుకున్నారు. దీంతో ఆయనను స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు చంద్రప్ప, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, మోహన్, వెంకటనర్సింహారెడ్డి, రాంరెడ్డి, తిరుమలయ్య అభినందించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ధారూరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీజేపీ వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోకట్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు. రైతు రాజ్యమని చెప్పి రైతులకు రైతు బంధు మాత్రమే కాదు.. సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయానికి పనిముట్లు ఇవ్వలేదని.. రైతులను మోసగించిందని తెలిపారు.

29న దుకాణాల సముదాయం బహిరంగ వేలం పాట

పూడూరు,ఆగస్టు 24 : గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం అభ్యర్థులు వేలం పాటలో పాల్గొనాలని గ్రామపంచాయతీ కార్యదర్శి మాణిక్యం పేర్కొన్నారు. ఈ నెల 29న పూడూరు మండలం మన్నెగూడ గ్రామపంచాయతీలోని 8 దుకాణల సముదాయల వేలం పాట ఉదయం 11 గంటలకు జరుగనున్నట్లు తెలిపారు. పాల్గొను అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి ఆస్తి విలువ, ఇంటి పన్ను, పంచాయతీకి సంబంధించిన ఇతర పన్నులు క్లియర్‌గా ఉన్న ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు నిరీత దరఖాస్తు ఫారాన్ని రూ.500 చెల్లించి పంచాయతీ కార్యాలయంలో పొందాలన్నారు. రూ.30వేల మొత్తాన్ని ఏదైన జాతీయ బ్యాంక్ నుంచి TS BPASS ACCOUNT GP MANNEGUDA పేరున డిమాండ్ డ్రాఫ్ట్‌ను వేలం ముందు రోజు 28న సాయంత్రం 5గంటల లోపు పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వేలంలో దక్కించుకున్న అభ్యర్థులు రూ.100ల బాండ్ పేపర్‌పై షరతులతో కూడిన ఒప్పందం సమర్పించాలన్నారు. దుకాణ సముదాయం దక్కించుకున్న వ్యక్తులు ఆరు నెలలకుగాను చెక్‌లను ముందుగానే సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు స్థానిక పంచాయతీ పరిధిలోనివారై ఉండాలన్నారు. ఇతర వివరాలను గ్రామపంచాయతీలో తెలుసుకోవచ్చని చెప్పారు. వేలం పాట అమోదించుటకుగాని, రద్దు చేయుటకుగాని గ్రామ పంచాయతీకి సర్వ హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, ఆగస్టు 24 : ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా దూరవిద్య మాధ్యమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. రెగ్యులర్‌గా చదువుకోలేని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వికారాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 31లోగా పదో తరగతిలో అడ్మిషన్ పొందుటకుగాను 14 సంవత్సరాలు, ఇంటర్‌కు 15 సంవత్సరాలు నిండి ఉండాలని ఆయన తెలిపారు. సప్లమెంటరీ విద్యార్థులు ఈ నెల ఆగస్టు 30వరకు ఫీజు చెల్లించాలన్నారు. రూ.25 ఫైన్‌తో సెప్టెంబర్ 4 వరకు, రూ.50 ఫైన్‌తో సెప్టెంబర్ 9 వరకు చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వికారాబాద్ ప్రధాన ఉపాధ్యాయుడు సెల్ నం.9502863645ను సంప్రదించాలన్నారు.

విషపూరితమైన మేత మేసిన ఎద్దులు, ఆవు మృతి

తాండూరు రూరల్, ఆగస్టు 24 : విషపూరితమైన మేత మేసిన రెండు ఎద్దులు, ఒక ఆవు మృతిచెందిన సంఘటన కరణ్‌కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. తాండూరు మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆనంద్ అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు, ఆవు విషపూరితమైన పశుగ్రాసం మేసి, మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

26న టెంకాయలు, పార్కింగ్ వేలం

పెద్దేముల్, ఆగస్టు 24 : మండల పరిధిలోని తట్టేపల్లి పరివాహక ప్రాంతంలోని అంబురామేశ్వర ఆలయంలో ఈ నెల 26న ఉదయం 11 గంటలకు టెంకాయలు, పార్కింగ్‌లకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచినవారు రూ.1000 ముందస్తుగా డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఈ నీళ్లు తాగేదెలా..?

మర్పల్లి, ఆగస్టు 24 : మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో గత వారం నుంచి పీర్లగుట్ట వాటర్ ట్యాంకు నుంచి వచ్చే నీళ్లు పూర్తిగా కలుషితమై వస్తున్నాయని.. వాటిని తాగలేకపోతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడం.. కలుషిత నీటితో విషజ్వరాలు సంభవించే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకును శుభ్రం చేయించి సురక్షితమైన నీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బూచన్‌పల్లిలో నల్లా నీరు

శోభాయమానంగా లక్ష తులసి అర్చన

గోవిందనామ స్మరణతో మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

ఆలయ ప్రాంగణంలో విష్ణు సహస్రనామాలతో తులసి అర్చన

కొడంగల్, ఆగస్టు 24 : కొడంగల్ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుడికి లక్ష నామాలతో లక్ష తులసి అర్చన కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. శ్రావణమాసంలోని మూడో శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి అలయ అర్చకులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గత 54 సంవత్సరాలుగా ఆలయంలో లక్ష తులసి అర్చన మహోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. స్వామివారికి పంచామృతాలతో పాటు పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు కిక్కిరిసిపోయారు. స్వామివారి కైంకర్యాన్ని కనులపండువలా తిలకించారు. లక్ష తులసి అర్చనతో ఆలయ ప్రాంగణ గోవిందనామ స్మరణతో మార్మోగింది. భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అర్చన నిర్వహించి భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. మొక్కులను చెల్లించుకున్నారు.

దుద్యాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

బ్యాగులు పంపిణీ

బొంరాస్‌పేట, ఆగస్టు 24 : మండలంలోని నాందార్‌పూర్ ప్రాథమిక పాఠశాల, దుద్యాల ఉన్నత పాఠశాలలోని పేద విద్యార్థులకు శనివారం యూత్ ఫర్ సేవా, స్టేట్ ఫర్ స్టేట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, పెన్నులు, వాటర్ బాటిళ్లను ఎంఈవో రాంరెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుకుంటారని, స్వచ్ఛంద సంస్థలు వారికి అందించే సహాయ సహకారాలు మరువలేనివన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు అందించే సహాయ సహకారాలు కూడా ఎంతో ఉపయోగపడుతాయన్నారు. యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధి సతీశ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోరిక మేరకు కొడంగల్ నియోజకవర్గంలో త్వరలోనే సైన్స్‌ల్యాబ్, వాటర్ ప్లాంట్, స్పోర్ట్స్ కిట్స్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దుద్యాల జీహెచ్ఎం విజయరామారావు, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, టీవీవీ నాయకులున్నారు.

గూడూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి వెంకట్

రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలి

దోమ, ఆగస్టు 24 : విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనంతోపాటు నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని దోమ మండల నోడల్ ఆఫీసర్ వెంకట్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గూడూరు, దొంగఎన్కెపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను మండల నోడల్ అధికారి వెంకట్ మధ్యాహ్నం సందర్శించి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరశీలించారు. అనంతరం పాఠశాలల్లో ఆపాధ్యాయుల బోధనను గమనించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు బోధనా సమయంలో తప్పనిసరిగా టీఎల్ఎంను ఉపయోగించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రావీణ్యం సాధించేలా బోధనను కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కృష్ణయ్య, షాహీన్‌బేగం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ వెంకట్ పాల్గొన్నారు.

మెయిన్ టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి

పరిగి, ఆగస్టు 24 : మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు జూలై నెల వేతనాలు మెయిన్ టీచర్లతో సమానంగా పూర్తి వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఐసీడీఎస్ అధికారులకు మెమోరాండం అందజేశారు. 2024 జనవరి 1 నుంచి మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించిన ప్రభుత్వం మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు పూర్తిగా కాకుండా పాత వేతనమే చెల్లించిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం వల్ల 4వేల మంది అంగన్‌వాడీ టీచర్స్ నష్టపోవడంతోపాటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

కులకచర్ల, ఆగస్టు 24 : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని శ్రీరామలింగేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆలూరి కామేశ్వరి అన్నారు. కులకచర్లలోని శ్రీరామలింగేశ్వర డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతోపాటు సమయాభావాన్ని పాటిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులున్నారు.

కాశీవిశ్వనాథస్వామి ఆలయ వార్షికోత్సవం

కులకచర్ల, ఆగస్టు 24 : కులకచర్ల మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కాశీవిశ్వనాథస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం మాజీ ఎంపీపీ రాజప్ప, గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, పార్వతీపరమేశ్వరుల కల్యాణం అర్చక మహాస్వాములు చేశారు.

ఆలయాల్లో ఘనంగా పూజలు

బొంరాస్‌పేట, ఆగస్టు 24 : శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుద్యాల మండలంలోని మామిడికుంట ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

పోలీసుల అదుపులో దొంగలు

ఇద్దరు దొంగలు అరెస్టు

తాండూరు రూరల్, ఆగస్టు 24 : ఇద్దరు దొంగలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి అన్నారు. కరణ్‌కోట గ్రామానికి చెందిన తుపాల బసప్ప, మేస్త్రీ దుర్గప్పల నాపరాతి గనుల్లో కేబుల్ వైర్‌తోపాటు 1 హెచ్‌పీ మోటర్‌ను ఇద్దరు వ్యక్తులు దొంగిలించారు. అనుమానంతో మల్కాపూర్ గ్రామానికి చెందిన జగ్గప్ప, రాములును విచారించగా.. నేరాన్ని అంగీకరించారని తెలిపారు. మోటర్‌ను కర్ణాటకలో విక్రయించి, వచ్చిన డబ్బులతో జల్సా చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఇద్దరు దొంగలను అరెస్టు చేశామని పేర్కొన్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాలాల, ఆగస్టు 24 : మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామ సమీపంలో స్థానిక ఎస్‌హెచ్‌వో శంకర్ సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8200 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు.

కల్తీ కల్లు బాధితులకు పరామర్శ

వికారాబాద్, ఆగస్టు 24 : పీరంపల్లి గ్రామ కల్తీ కల్లు బాధితులు వికారాబాద్ మిషన్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం బాధితులను పరామర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు రాంరెడ్డి, అశోక్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కమల్‌రెడ్డి మాట్లాడుతూ.. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలన్నారు. అధికారులు, ఎక్సైజ్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పడిగళ్ల అశోక్ మాట్లాడుతూ.. బాధితులను అవమానపరిచేలా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నీళ్ల వల్లే ఇలా జరిగి ఉండవచ్చనే కారణం చెప్పడం సరైనది కాదని, బాధితులే స్వయంగా తాము కల్లు తాగినందుకే ఇలా జరిగిందన్నారు. ఒకవేళ తాగునీటి వల్ల అయితే తమ కుటుంబ సభ్యులు ఎందుకు అస్వస్థతకు గురి కాలేదని ప్రశ్నిస్తున్నారన్నారు. దీనికి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వికారాబాద్ మిషన్ హాస్పిటల్‌లో మాసన్నగారి వెంకటమ్మ(65) పరిస్థితి విషమంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గయాజ్, రమేశ్, పాండు, మహిపాల్ నాయక్, రాజు, మల్లేశ్‌యాదవ్, అంజి ఉన్నారు.

కల్తీ కల్లు బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT- 332617

PLOT FOR SALE

★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218

FARM PLOT SALE

★ యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ప్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో & బాలానగర్ జడ్చర్ల బెంగుళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి॥ 7780483434.
NT-332574

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.